ఇంకెన్నేళ్లు పడుతుందో?

- సొంతింటి కల నెరవేరుతుందా?
- పునాదులు, పిల్లర్ల స్థాయిలోనే 'డబుల్' ఇళ్లు
- మామిళ్లవాయి, మనుబోతులగూడెం గ్రామాల్లో దుస్థితి
- గిరిజన గ్రామాల్లో ప్రశ్నార్థకంగా మారిన ఇళ్ల నిర్మాణం


ఎలకలగూడెంలో పిల్లర్ల స్థాయిలో ఆగిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

అశ్వాపురం: నిరుపేదలకు రెండు పడక గదుల సొంతింటి కళ ఇప్పట్లో నెరవేరేలా లేదు. మండలంలోని మామిళ్లవాయి, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గిరిజన గ్రామాల్లో నిరుపేదల కోసం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు అర్థంతరంగా నిలిచిపోయాయి. ఐదేళ్లుగా ఇండ్ల నిర్మాణం పూర్తవుతుందని గంపెడాశతో ఎదురు చూసిన గిరిజన నిరుపేదలకు నిరాశ ఎదురై సొంతింటి కల ఇప్పట్లో నెరవేరేలా లేదు.

ఐదేళ్లు గడిచినా ఒక్క ఇల్లూ కాలేదు..

మండలంలోని మామిళ్లవాయి, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గిరిజన గ్రామాల్లో 2018లో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ, ఐదేళ్లుగా ఒక్క ఇల్లు నిర్మాణం కూడా పూర్తి కాలేదు. 2017లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5.04 లక్షల చొప్పున మామిళ్లవాయిలో రూ.1.51 కోట్లతో 30 ఇండ్లు, ఎలకలగూడెంలో రూ.1.08 కోట్లతో 20 ఇళ్లు, మనుబోతులగూడెం గ్రామంలో రూ.1.08 కోట్లతో 20 ఇళ్లకు సంబంధించిన నిర్మాణ పనులు అట్టహాసంగా ప్రారంభించారు. కానీ, కాలం గడుస్తున్నా కొద్దీ పనులు కూడా నడుస్తూనే ఉన్నాయి.. రెండేళ్లపాటు నత్తనడకన నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు ప్రస్తుతం నిర్మాణ వ్యయం పెరగడంతో బిల్లులు గిట్టుబాటు కాదని భావించి నిర్మాణ పనులు అర్థంతరంగా నిలిపివేశారు.

గోడ కడతారా, లేదా?

మామిళ్లవాయి, ఎలకలగూడెం, మనుబోతులగూడెం గిరిజన గ్రామాల్లో 2018లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా ఐదేళ్లు గడిచినా ఇళ్ల నిర్మాణాలు పునాదులు, పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. మామిళ్లవాయిలో 10 ఇళ్లు స్లాబ్ పూర్తి కాగా, 10 ఇళ్లు స్లాబ్ దశలో, మరో 10 ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. ఎలకలగూడెంలో 20 ఇళ్లు, మనుబోతులగూడెంలో 20 ఇళ్లు పునాదులు, పిల్లర్ల స్థాయిలోనే ఉన్నాయి. ఐదేళ్లు గడిచినా ఒక్క ఇల్లు నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో జరగలేదు. ఎలకలగూడెం గ్రామంలో గత నెల 20 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి జాబితా జిల్లా కలెక్టర్‌కు పంపించారు. ఇళ్ల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన నిరుపేదలు కోరుతున్నారు.


మామిళ్లవాయిలో నిలిచిన ఇళ్ల పనులు

పాత టెండర్ల రద్దుకు ప్రతిపాదనలు

మామిళ్లవాయి, మనుబోతులగూడెం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌లతో సంబంధిత అధికారులు పలుమార్లు మాట్లాడారు. కానీ, ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి సదరు కాంట్రాక్టర్‌లు ముందుకు రాలేదు. దీంతో రెండు గిరిజన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పాత టెండర్ల రద్దుకు అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పాత టెండర్లు రద్దు చేసి, నిర్మాణ వ్యయం అంచనా వేసి మళ్లీ టెండర్లు పిలవనున్నారు. ఈ ప్రక్రియ మరింత ఆలస్యమై ఇళ్ల నిర్మాణాలు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్లతో చర్చించినా ఫలితం లేదు



మామిళ్లవాయి, మనుబోతులగూడెం గ్రామాల్లో ఇళ్ల కాంట్రాక్టర్లతో చర్చించినా ముందుకు రాలేదు. దీంతో ఈ గ్రామాల్లో పాత టెండర్ల రద్దుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. మళ్లీ టెండర్లు పిలవాల్సి ఉంటుంది. ఎలకలగూడెంలో కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షిస్తున్నాం.

–ప్రసాద్, ఏఈ ఐటీడీఏ

ఇకనైనా ఇళ్లు నిర్మించాలి



మా గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పునాదుల దశలోనే ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడం లేదు. ఇళ్లు పూర్తవుతాయి.. ఇక మా సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్నాం. ఆశ తీరలేదు. అధికారులు ఇకనైనా స్పందించి ఇళ్లు త్వరగా పూర్తయ్యేలా పర్యవేక్షించాలి.

–తాటి చినసూర్యం, ఎలకలగూడెం

సాగులో ఉన్నదొకరు.. పరిహారం ఇంకొకరికి..

దుమ్ముగూడెం: సీతమ్మసాగర్ ప్రాజెక్టు కరకట్ట నిర్మాణంలో భాగంగా భూమి కోల్పోతున్న రైతులకు న్యాయం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆదివాసీ నాయకులు సొందె మల్లూరు, సర్పంచ్ తెల్లం వరలక్ష్మి విమర్శించారు. సీతానగరంలో తహసీల్దార్ చంద్రశేఖర్, అధికారులను మంగళవారం భూబాధితులతో పాటు వారు కలిసి మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతో సమస్యలకు పరిష్కారం లభించడం లేదని, 50/1 సర్వే నంబర్‌లో ఐదు ఎకరాల భూమికి పొజిషన్‌లో ఉన్న రైతు వాగే చలపతిరావుకు కాకుండా మరొకరికి పరిహారం ఎలా ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఇకనైనా అర్హులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య ప్రణాళికపై సర్వే

అశ్వాపురం: లైట్ హౌస్ గ్రామ పంచాయతీగా ఎంపికైన మండలంలోని మొండికుంటలో మంగళవారం ఎస్‌బీఎం, ఐటీసీ ఎంఎస్‌కే వాష్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య ప్రణాళికపై సర్వే నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ స్థాయి అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఐకేపీ సిబ్బందికి గ్రామ పంచాయతీ సోషల్ మ్యాప్ వేసి సర్వేపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఐటీసీ ఎంఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణ, సందీప్, వెంకట్రావు, రాజ్‌కుమార్, వెంకటేశ్వరరావు, కార్యదర్శి సైదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పంపిణీలో అవకతవకలు

గుండాల: మండలంలోని యాపలగడ్డ సమీపంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో అవకతవకలు జరిగాయని టీడీపీ జిల్లా నాయకులు తోలెం సాంబయ్య, ఇల్లందుల నర్సింహులు, అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గతంలో ఇళ్లు లేని వారికి స్థలాలు కేటాయించారని, వారికి తిరిగి ఇళ్లు కేటాయించడమేంటని ప్రశ్నించారు.

క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవం

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని గుట్టమల్లారం పంచముఖ వేద గాయిత్రి ఆలయం 15వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పార్వతీ పరమేశ్వరుల శాంతి కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అక్కినేపల్లి వసంతాచార్యులు, దోసపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు జీపీ అనుబంధ వలస గొత్తికోయ గ్రామమైన చింతకుంటకు చెందిన గిరిజన యువకులకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసరావు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు జితేందర్, సురేశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఫొటో, వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. గతేడాది అనారోగ్యంతో మృతి చెందిన ఫొటోగ్రాఫర్ మోహన్ కుటుంబానికి సంఘం బాధ్యులు రూ.28 వేల నగదు అందజేసి భవిష్యత్‌లోనూ అండగా ఉంటామని తెలిపారు. వెంకటపతిరాజు, షరీఫ్, శోభన్‌బాబు, శ్రీనివాసరావు, సురేష్, మంగరాజు, సందీప్, కల్యాణ్ పాల్గొన్నారు.

వైఖరి మార్చుకోవాలి

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాక పీఏసీఎస్ చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి తన వైఖరి మార్చుకోవాలని వైస్ చైర్మన్ కమటం సురేశ్, డైరెక్టర్లు పేర్కొన్నారు. మొండికుంటలోని సంఘం కార్యాలయ ఆవరణలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. పాలకవర్గం చేసిన తీర్మానాలను అమలు చేయకపోగా, సంఘం డబ్బును చైర్మన్ సొంతానికి వాడుకుంటున్నారని ఆరోపించారు. సురేశ్, కాసరబాద సందీప్, సోమ వెంకటరెడ్డి, కోడి వెంకన్న, రామకృష్ణ, తైదల నర్సయ్య, కుర్సం లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికులకు సన్మానం

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓసీ–2లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఆపరేటర్లు హరి ఆల్బన్, మురికి నాగేశ్వరరావును గని యాజమాన్యం, సహోద్యోగులు, నాయకులు మంగళవారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు.

పరిహారం చెల్లించాలి

మణుగూరురూరల్: ఏడాదిన్నర కిందట మణుగూరు ఏరియాలోని ఓసీ–2లో జరిగిన ప్రమాదంలో మరణించిన వేల్పుల చిన్నవెంకన్న కుటుంబానికి పరిహారం చెల్లించాలని కోరుతూ మంగళవారం మృతుడి భార్య సుజాత, కుమారుడు గణేశ్ ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతిపత్రం అందజేశారు. నర్సిరెడ్డి, నాజర్‌పాషా పాల్గొన్నారు.

పరీక్షలు చేయించుకోండి..

బూర్గంపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత కోరారు. కృష్ణసాగర్ పాఠశాల ఆవరణలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలలో ఆరు నెలల పాటు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ప్రజాప్రతినిధులు, నాయకులు కొడిమె వెంకటేశ్వర్లు, గోవింద్, ఉండేటి గోవర్దన్, రాజేశ్, ఉపేందర్, శ్రీను, రవి, మోషు, వెంకటరత్నం, చంద్రయ్య, ఎడ్ల శ్రీను పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి

బూర్గంపాడు: సీపీఎం జిల్లా నాయకులు, అమరజీవి బండారు వెంకటేశ్వర్లు ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. నకిరిపేట గ్రామంలో మంగళవారం వెంకటేశ్వర్లు వర్ధంతి సభను నిర్వహించారు. బత్తుల వెంకటేశ్వర్లు, పాండువుల రామనాథం, గుంటక కృష్ణ, రాయల వెంకటేశ్వర్లు, పాండవుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దోమతెరలు పంపిణీ

కరకగూడెం: నిరుపేద ఆదివాసీలకు సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని ఏడూళ్లబయ్యారం సీఐ రాజగోపాల్ కోరారు. మంగళవారం మండలంలోని రేగళ్ల పరిధి వలస ఆదివాసీలకు ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు ఎస్‌కే సోందుపాషా సమక్షంలో సీఐ 150 దోమతెరలను పంపిణీ చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న వలస ఆదివాసీలకు, నిరుపేదలకు సాయం చేయడంలో సంతృప్తి లభిస్తుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంకు చెందిన పి.మహేష్ తన స్నేహితుడుతో కలిసి ద్విచక్రవాహనంపై అశ్వారావుపేటకు మంగళవారం వస్తున్నాడు. ఈక్రమంలో పాపిడిగూడెం వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో ఢీకొట్టారు. ఈ ఘటనలో మహేష్‌కు బలమైన గాయాలు కాగా సీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం అనంతరం జంగారెడ్డిగూడెం తరలించారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. వారి సృజనాత్మకతను పలువురు ప్రశంసించారు. అనంతరం క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

–సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: జవహర్ స్కూల్‌లో..


దమ్మపేట: విద్యార్థులు గీసిన గుండె బొమ్మ


దుమ్ముగూడెం: వ్యాసరచన పోటీల్లో విజేతలతో జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం, ఉపాధ్యాయులు


చండ్రుగొండ: విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి..

అశ్వాపురం: వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలని టైలర్స్ అసోసియేషన్ మండల గౌరవ అధ్యక్షుడు కోటిలింగం డిమాండ్ చేశారు. టైలర్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో జెండా ఆవిష్కరించారు. మోహిద్దీన్, అజయ్, వెంకటేశ్వర్లు, మేకల అంజిబాబు, కొమరయ్య, గద్దల వెంకటేశ్వర్లు, సుభాని, నారాయణ పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో వేడుకలు

అశ్వారావుపేటరూరల్: టైలర్స్ డే వేడుకలను మంగళవారం అశ్వారావుపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గెస్ట్ హౌజ్ ఆవరణలో కుట్టు మిషన్‌ను కనిపెట్టిన విలియమ్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌కే రఫీ, గన్నిన రామకృష్ణ, భగ్గవన్ నారాయణ, సత్యనారాయణ, సాంబశివరావు, తాడేపల్లి సిద్ధు, మౌలాలి, ఇమానీ, బ్లూమూన్ శ్రీను, శ్రీలక్ష్మి, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగి కుమారుడికి ప్రోత్సాహకం

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–4లో వెల్డర్‌గా విధులు నిర్వహిస్తున్న గజ్జల రాజు కుమారుడు కిరణ్‌కుమార్ వారణాసి ఐఐటీలో బీటెక్ 2వ సంవత్సరం చదువుతున్నందుకు సంస్థ ఇచ్చే ప్రోత్సాహకాన్ని మంగళవారం ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని కార్మికుల పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్.రమేశ్, సింగు శ్రీనివాస్, వి.ప్రభాకర్‌రావు, జి.కిరణ్‌కుమార్, రాజు పాల్గొన్నారు.


ప్రోత్సాహకం అందజేస్తున్న జీఎం రాంచందర్

ఐస్ బండ్ల కార్మికులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సాయికుమార్

భద్రాచలంఅర్బన్: ఐస్ బండ్ల కార్మికులకు ముద్ర రుణాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేసి, అన్నివిధాలా ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బల్లా సాయికుమార్ కోరారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం భద్రాద్రి గ్రామీణ ఐస్ బండ్ల సంఘం కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చీదరగడ్డ స్వామి, అధ్యక్షుడిగా దేగల నరేశ్, ఉపాధ్యక్షులుగా హనుమంతు, కనుకు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా భూక్యా ఉపేందర్, సహాయ కార్యదర్శిగా ఎ.భాస్కర్, కోశాధికారిగా వల్లపోగు రామకృష్ణతో పాటు 29 మందితో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు మారెడ్డి శివాజీ, స్వామి, నరేశ్, హనుమంతు, శ్రీను, బాబూరావు, రామకృష్ణ, లక్ష్మీనారాయణ, రమేశ్, రాము, భాస్కర్, రామకృష్ణ, ఉపేందర్, రవి, జోగారావు, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ల ఆవిష్కరణ

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు వైద్యశాల ఆవరణలో ఈనెల 6వ తేదీ నుంచి జరిగే మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌లను నాయకులు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కనితి రాముడు, సోయం కామరాజు, సొందె మల్లూరు, తిరుపతిరావు, వెంకటేశ్, దామెర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు మండల కమిటీ ఎన్నిక

బూర్గంపాడు: మున్నూరుకాపు సంఘం మండల నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ తోడేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా వారాల కనకారావు, ప్రధాన కార్యదర్శిగా బత్తిన నాగప్రసాద్‌ను ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొసన అంకబాబు, కోశాధికారిగా గోవిందు వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులుగా బెల్లంకొండ వాసుదేవరావు, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా ఆకుల పద్మ, ప్రధాన కార్యదర్శిగా అనంతలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాపినేని సరోజని, కోశాధికారిగా జాదవుల ప్రమీలను ఎన్నుకున్నారు.

రూ.3.50 చెల్లించాలి

చర్ల: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా 50 ఆకుల తునికాకు కట్టకు రూ.3.50 చెల్లించాలని సీపీఐ నాయకుడు కల్లూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. చర్లలోని పార్టీ కార్యాలయంలో ఉప్పులూరి నాగరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన పార్టీ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. తునికాకు కట్ట ధర పెంచి, బోనస్ సొమ్ము విడుదల చేయడంతో పాటు మొదెం కొట్టే పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. అలాగే, ఇటీవల సర్వే చేసిన పోడుభూములకు సంబంధించి దరఖాస్తుదారులందరికీ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు అడ్డగర్ల తాతాజీ, పోతయ్య, కొంగూరు రాము, పాలంచ రామారావు, కారం సమ్మయ్య, తెల్లం లక్ష్మీనారాయణ, నూపా తిరుపతిరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జోడోయాత్ర

మణుగూరురూరల్: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య ఆదేశాల మేరకు మండలంలోని శ్రీకృష్ణాపురం గ్రామంలో కాంగ్రెస్ నియోజకవర్గ మహిళా నాయకురాలు పోలెబోయిన శ్రీవాణి మంగళవారం హాత్ సే హాత్ జోడోయాత్ర నిర్వహించారు. యాత్రలో భాగంగా ఆమె గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం మృతికి సంతాపం

బూర్గంపాడు/భద్రాచలంఅర్బన్: నాగినేని ప్రోలు రెడ్డిపాలెం సబ్‌సెంటర్‌లో ఏఎన్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్న విజయమ్మ (45) సోమవారం మృతిచెందగా మంగళవారం ఏపీలోని కూనవరం మండలం మర్రిగూడెంలో ఆమె భౌతికకాయానికి భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజ్‌కుమార్, వీసల కృష్ణ, కామిరెడ్డి శ్రీలత, శ్రావణి, యడమకంటి ఝాన్సీలక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్ఓ రవికుమార్, యడమకంటి సుధాకర్‌రెడ్డి, సానికొమ్ము రాంచంద్రారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

పొత్తు ఉన్నా, లేకున్నా బరిలో నిలుస్తాం

మణుగూరుటౌన్: వచ్చే సాధారణ ఎన్నికల్లో పొత్తులు ఉన్నా, లేకున్నా సీపీఐ పినపాక నియోజకవర్గంలో పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య తెలిపారు. మణుగూరులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పినపాక నియోజకవర్గ అభివృద్ధికి సీపీఐ ఎమ్మెల్యేలు ఎంతో కృషి చేశారని తెలిపారు. కాగా, మణుగూరులో కొందరు నాయకుల భూదందాలు, మున్సిపాలిటీలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న పనులపై సీపీఐ ఆధ్వర్యాన ఆందోళనలు చేపడుతామని చెప్పారు. ప్రతీ కార్యకర్త నియోజకవర్గంలో పార్టీ పటిష్టత కోసం పాటుపడాలని ఆయన కోరారు. నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఆర్.లక్ష్మీనారాయణ, జంగం మోహన్‌రావు, సోందే కుటుంబరావు, ఎస్‌కే సర్వర్, అక్కి నర్సింహారావు, తోట రమేశ్, జక్కుల రాజబాబు, చింతల దశరథం, ఎస్‌వీ నాయుడు, రాయల భిక్షం తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అయోధ్య

పార్టీ బలోపేతానికి కృషి చేయడమే నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: నిస్వార్థ ప్రజా సేవకుడైన కొండలరావు స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి కృషి చేయడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిటికెన ముసలయ్య అన్నారు. సీపీఎం నాయకుడు, రజక వృత్తిదారుల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఐతంరాజు కొండలరావు వర్ధంతి సభ గుంటిపల్లి లక్ష్మీకాంత్ అధ్యక్షతన మనుబోతుల చెరువు కాలనీలో మంగళవారం జరగగా, వెంకటేశ్వర్లు, ముసలయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, ఎం.రేణుక, యలమంచి వంశీకృష్ణ, బండారు శరత్‌బాబు, నాదెళ్ల లీలావతి, గౌతమి, డాక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నాభిశిలకు ప్రత్యేక పూజలు

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని తొట్టిపంపు పంచాయతీ ఒడ్డుగూడెంలో నాభిశిల, ముత్యాలమ్మ, పోతురాజు విగ్రహాల ప్రతిష్టాపన పూజలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ అభివృద్ధికి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో కణితి ఆదినారాయణ, మోడియం మాదప్ప, వాడే చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.


నాభిశిల వద్ద పూజలు చేస్తున్న నాయకులు



అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



మండల కేంద్రం నుంచి పేటమాలపల్లి వైపు వెళ్లే ప్రధాన మార్గంలో సీసీ రోడ్డు పగుళ్లు వచ్చి ధ్వంసమైంది. ఈ మార్గంలో ఒక్కో చోట దాదాపు నాలుగు అడుగుల మేర పగుళ్లు ఏర్పడి గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో పలువురి ద్విచక్రవాహనాలు అదుపుతప్పగా.. లారీ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్, క్లీనర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే రహదారి మరమ్మతులపై అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

–అశ్వారావుపేటరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి : జి.హరికృష్ణ, ఈఓ, అశ్వారావుపేట, సెల్ నంబర్: 94916 38720